ANN తెలుగు

Follow: @ANNTELUGU

REGISTERED NUMBER: APTEL/2014/58382

23-07-2025

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 229 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD బుధవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## మరో మైలురాయి దాటిన తెలంగాణ ఆర్టీసీ..

**ఇప్పటి వరకు 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం**

మహిళలు ఉచిత ప్రయాణ విలువ రూ.6700 కోట్లు

ఎప్పటికప్పుడు ఆర్టీసీకి నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వం

రేపు రాష్ట్ర వ్యాప్తంగా 97 ఆర్టీసీ డిపోల్లో, 341 బస్ స్టేషన్ లలో సంబరాలు

ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

వివరాలు 3లో

టాప్ న్యూస్

## ఆంధ్రా అమ్మేయాలి

- ఆ పథకం ఇవ్వాలంటే అంత డబ్బు అవసరం
- మహిళలకు నెలకు రూ.1500 పథకంపై మంత్రి అచ్చెన్న సంచలన వ్యాఖ్యలు



02

## ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

- నేడు, రేపు కీలక సమావేశాలు
- రేపు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలతో భేటీ



03

## రప్పా రప్పా అంటే మెడచూపిస్తామా? తాట తీస్తాం

వైసీపీకి పవన్ కల్యాణ్ వార్నింగ్




03



### తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

- ఫలితాల్లో 30,649 మంది అభ్యర్థులు క్వాలిఫై
- టెట్ పరీక్షలకు 1,37,429 మంది హాజరు

వివరాలు 3లో



### ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

- ఉపరాష్ట్రపతిగా నితీష్ కుమార్ ?
- తెరపైకి శశిథరూర్, మరో ఇద్దరు కేంద్ర మంత్రుల పేర్లు

వివరాలు 2లో

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,01,290 |
| 22 క్యారెట్ | 92,850 |
| సిల్వర్ (కేజీ) | 1,28,000 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 82,186.81 |
| నిఫ్టీ | 25,090.60 |

### ఈరోజు గుడ్డు ధరలు

ఎన్ఈసీసీ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.8 | 144 |

హోల్ సేల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.8 | 144 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 5.09 | 155.52 |




# ఎవరు సీనియర్?

## ఈటల-బండి వార్‌లో కొత్త కోణం

- రాజకీయాల్లో హాట్ టాపిక్
- బండి సంజయే సీనియర్ అంటూ వాదనలు
- ఈటల కంటే పదేళ్ల ముందే రాజకీయాల్లోకి బండి
- ఈటల వ్యాఖ్యలు తిప్పికొడుతూ సోషల్ మీడియాలో క్యాడర్ ప్రచారం

తెలంగాణ రాజకీయాల్లో కేంద్రమంత్రి బండి సంజయ్ పై మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై బిజెపి నేతలు ఒక్కసారిగా ఉలిక్కిపడగా, ఈ వ్యాఖ్యల ప్రభావం కమలం రాజకీయాలపై తీవ్రంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఈటల వ్యాఖ్యల్లోని ఎన్నో అంశాలపై.. ఇటు బిజెపిక్యాడర్ లోనే కాక రాజకీయవర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. "బీకేర్ ఫుల్ నా కొడకా... నువ్వెంత? బచ్చా.... నువ్వెక్కడ? నేనెక్కడ?... 2002లోనే రాజకీయాల్లోకి వచ్చి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన. ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన. కరీంనగర్ లో నా అడుగు పడని ఊరు లేదు." ఇటీవల శామీర్ పేటలోని తన నివాసంలో తన వర్గం నాయకులతో నిర్వహించిన సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని ఉద్దేశించి మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలివి. ఆ వ్యాఖ్యలు ఒక్కసారిగా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. - మహా, హైదరాబాద్

02

# ఏడాదిన్నరలో కొండంత చేశాం

**గోరంత కూడా చెప్పుకోలేకపోతున్నాం**


సాధించిన ప్రగతికి విస్తృత ప్రచారం కల్పించాలి

అప్పుడు, ఇప్పుడు ఆ పార్టీది గోబెల్ ప్రచారమే

డీపీఆర్ వోలతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, మహా :** ఏడాదిన్నర పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఎన్నోసంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తూ ముందుకు సాగుతున్నప్పటికీ చేసిన మంచి పనులను సవివరంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నామని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు. నేడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీ పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో చెయ్యని వాటిని చేసినట్లుగా గోబెల్ ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టిందని, ప్రతిపక్షంలో కూడా అదే ఒరవడిని కొనసాగిస్తూ ప్రజల కళ్లకు గంతలు కడుతోందని విమర్శించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేసిన దాన్ని కూడా పూర్తిగా చెప్పుకోలేకపోతున్నామన్నారు. సచివాలయంలో సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ముఖ్య మంత్రి ప్రజాసంబంధాల అధికారి జి. మల్సూర్‌తో కలిసి మంగళవారం జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు

మిగతా 2లో



## నడ్డాను కలిసిన బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు

భవిష్యత్ కార్యాచరణపై చర్చ



వివరాలు 3లో

## కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్ లేకుండా.. ఢిల్లీలో ఆరుగురు బీజేపీ ఎంపీల భేటీ

దీని సంకేతమేంటి?

వివరాలు 3లో

# హరీశ్ రావుపై తిరగబడ్డ సిద్దిపేట!

**ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు**

హరీశ్ వ్యాఖ్యలపై పలువురు అభ్యంతరం

మరోవైపు ప్రోటోకాల్ రగడ..

కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల పోటాపోటీ నినాదాలు




**హైదరాబాద్, మహా:** మాజీ మంత్రి హరీశ్ రావుకు అనూహ్య పరిణామం ఎదురైంది. మంగళవారం సిద్దిపేట, గజ్వేల్ నియోజక వర్గాలకు సంబంధించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంఛార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి హాజరయ్యారు.

మిగతా 3లో

# ఉత్తరాది నకిలీల చెరలో తెలంగాణ మార్కెట్లు

## రాజస్థాన్, యూపీ, హర్యానా నుండి డూప్లికేట్లు

- డూప్లికేట్ ఎలక్ట్రిక్ వస్తువుల మాయ ప్రపంచం
- నకిలీ సామాగ్రి వెనుక ఉన్న ముఠాల రాజకీయం
- ప్రజల ప్రాణాలను బలికొంటున్న చౌకధర
- ఖమ్మం నుండి కామారెడ్డి దాకా ఫేక్ వ్యాపారం



02

## బీసీ రిజర్వేషన్ బిల్లుపై ఒత్తిడి తెస్తాం

- పోస్ట్ క్యాస్ట్, ప్రీ క్యాస్ట్ సర్వే రిపోర్ట్ అసెంబ్లీలో పెట్టాం
- పార్లమెంట్‌లో పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తాం
- గవర్నర్ ఆమోదం పొందగానే 42% రిజర్వేషన్లపై ముందుకెళ్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి బీసీలంటే చిన్నచూపు ఉన్నట్లుంది
- రాంచంద్రరావు లీగల్ నోటీసులకు భయపడే వ్యక్తిని కాదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యల

03






# ఎవరు సీనియర్?

హైదరాబాద్, మహా

తెలంగాణ రాజకీయాల్లో కేంద్రమంత్రి బండి సంజయ్ పై మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై బిజెపి నేతలు ఒక్కసారిగా ఉలిక్కి పడగా, ఈ వ్యాఖ్యల ప్రభావం కమలం రాజకీయాలపై తీవ్రంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఈటల వ్యాఖ్యల్లోని ఎన్నో అంశాలపై.. ఇటు బిజెపి క్యాడర్ లోనే కాక రాజకీయవర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. ''బీకేర్ ఫుల్ నా కొడకా... నువ్వెంత? బచ్చా.... నువ్వెక్కడ? నేనెక్కడ?... 2002లోనే రాజకీయాల్లోకి వచ్చి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన. ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన. కరీంనగర్ లో నా అడుగు పడని ఊరు లేదు.'' ఇటీవల శామీర్ పేటలోని తన నివాసంలో తన వర్గం నాయకులతో నిర్వహించిన సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని ఉద్దేశించి మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలివి. ఆ వ్యాఖ్యలు ఒక్కసారిగా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. కేంద్రమంత్రిపై, రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసి పార్టీలో జోష్ తీసుకొచ్చి మనమూ అధికారంలోకి రాగలం.. అన్న ఆత్మవిశ్వాసం తీసుకొచ్చిన నేతపై ఈ రకంగా ఎందుకు మండిపడాల్సివచ్చిందన్న ప్రశ్నలకు సమాధానం లేదు. నాడు గులాబీజెండాకు ఓనర్ అంటూ ధిక్కార జెండా ఎత్తుకున్న ఈటల రాజేందర్.. ఇపుడు ఆశించిన పదవులు దక్కకపోయేసరికి మళ్ళీ అదే ధిక్కార పంథా ఎంచుకున్నాడా? మర్మమేమిటి అన్న ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది.

## పాలిటిక్స్ లో బండి సంజయే సీనియరా?

ఈటలతో పోలిస్తే రాజకీయాల్లోనూ బండి సంజయ్ అత్యంత సీనియర్ అన్న చర్చను నేతలు ముందుపెడుతూ ఇందుకు సంబంధించిన సాక్ష్యాలివే అంటున్నారు. ప్రజా ప్రతినిధిగా కూడా ఈటల కంటే బండి సంజయే సీనియర్. ఈటల రాజేందర్ 2002లోనే రాజకీయ రంగ ప్రవేశం చేశారు. కానీ బండి సంజయ్ మాత్రం 1990లోనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. బీజేవైఎం ఆలిండియా సెక్రటరీగా పనిచేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయమైన ఢిల్లీలో ఏడాదిపాటు పనిచేశారు. ఢిల్లీలో ఎన్నికల ఇంఛార్జిగా కూడా కొనసాగారు. భారతీయ జనతా యువమోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శిగా, టౌన్ అధ్యక్షుడిగా, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా, జాతీయ కార్యదర్శిగా సేవలందిస్తూ కేరళ,తమిళనాడు ఇంచార్జి గా బాధ్యతలు చేపట్టారు. 1990వ దశకంలో రాజకీయ కురు వృద్ధుడు, బీజేపీ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ ఉప ప్రధాని ఎల్.కె అద్వానీ సురాజ్ రథ యాత్రలో బండి సంజయ్ వెహికల్ ఇంచార్జి గా, అద్వానీ రథయాత్ర చేసినన్నాళ్లు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశారు. 2020 లో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టి దుబ్బాక ఉప ఎన్నికల్లో రఘునందన్ రావును, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఈటల రాజేందర్ ను గెలిపించడంలో కీలక పాత్ర పోషించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ 2 స్థానాలున్న బీజేపీకి 48 స్థానాలు రావడంలో బండి సంజయ్ చేసిన కృషి ఓ చరిత్ర. ప్రజా సంగ్రామ యాత్రతో పాతబస్తీలో బీజేపీ సత్తాను చాటిన బండి సంజయ్ 1650 కి.మీల మేరకు పాదయాత్ర చేసి అంతకు ముందు వరకు పట్టణాలకే పరిమితమైన కాషాయ జెండాను పల్లెపల్లెకు తీసుకెళ్లారు. బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయం బీజేపీయే అనే భావన ప్రజల్లోకి వెళ్లేలా చేశారు. ఆ తరువాత జరిగిన కొన్ని పరిణామాలతో 2023లో అధ్యక్ష బాధ్యతల నుండి తప్పుకున్న బండి సంజయ్ ను కొద్ది నెలల్లోనే బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, 2024లో జాతీయ కిసాన్ మోర్చా ఇంఛార్జి గా కొనసాగారు. ఈ లెక్కన చూస్తే నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం బండి సంజయ్ సొంతం. ఈటల రాజేందర్ విషయానికొస్తే...2003లో టీఆర్ఎస్ లో చేరి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, 2021 వరకు రాష్ట్ర నాయకుడిగా కొనసాగారు. అంటే ఈటల రాజేందర్ రాజకీయ అనుభవం 22 ఏళ్లు మాత్రమే. దీనిని బట్టి చూస్తే రాజకీయాల్లో ఈటల రాజేందర్ కంటే బండి సంజయ్ సీనియర్ అన్న విశ్లేషణ ఉంది.



## ప్రజాప్రతినిధిగా కూడా...

ఇక ప్రజాప్రతినిధిగా ఎవరు సీనియర్ అన్న విషయానికొస్తే... ఇందులోనూ ఈటల కంటే 10 ఏళ్లకు ముందే బండి సంజయ్ కుమార్ 1994లోనే ది కరీంనగర్ కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ గా గెలుపొందారు. 14 వేల పైచిలుకు ఓట్లు కలిగిన ఈ బ్యాంకు ఎన్నికల్లో హేమాహేమీలను మట్టి కరిపించి తన ప్యానెల్ నుండి బండి సంజయ్ ఒక్కరే గెలుపొందడమే కాకుండా 1999 లో రెండవ సారి బంపర్ మెజారిటీ తో గెలుపొందారు. కరీంనగర్ నగర పాలక సంస్థ గా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిగా కరీంనగర్ లో 2005లోనే బిజెపి కార్పొరేటర్ గా గెలిచారు. నాటి నుండి 2019 వరకు కార్పొరేటర్ గా కొనసాగారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా... పోటీ చేసిన ప్రతిసారి ఓట్ల సంఖ్యను గణనీయంగా పెంచుకుంటూ వచ్చారు. 2014లో 52 వేల ఓట్లు సాధిస్తే, 2018 ఎన్నికల్లో 66వేల ఓట్లను సాధించారు. 2023 ఎన్నికల్లో 89 వేల ఓట్లకు పైగా సాధించి గెలుపు అంచుదాకా వచ్చినా ప్రత్యర్ధి చేతిలో కేవలం 1 శాతం ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. మొదటి నుండీ ఒకే సిద్ధాంతం కోసం ప్రతికూల పరిస్థితుల్లోనూ బండి సంజయ్ పోరాడి తనతో పాటు పార్టీ పురోగమనానికి పాటుపడ్డారు.

## ఎవరు సీనియర్?

రాజకీయాల్లో, పదవుల్లో, ప్రజా ప్రతినిధిగా ఎవరికి ఎక్కువ అనుభవం ఉంది? ఎవరు సీనియర్ ? అనే అంశాలు... టాక్ ఆఫ్ తెలంగాణ గా మారాయి. ''ఈటల రాజేందర్ కంటే బండి సంజయ్ సీనియర్ . రాజకీయంలో అనుభవం లేదు. సంజయ్ కంటే ఈటలే రాజకీయాల్లో, పదవుల్లో ఎంతో సీనియర్'' అనే భావన పొలిటికల్ సర్కిళ్లలో వ్యాప్తిలో ఉంది. జన బాహుళ్యంలోనూ ఇదే చర్చ ఉంది. అయితే ఇది ముమ్మాటికీ తప్పు అని బిజెపి క్యాడర్ వాదిస్తూ ఇందుకు సంబంధించిన చర్చను జనం ముందు పెట్టారు.

# ఏడాదిన్నరలో కొండంత చేశాం

## గోరంత కూడా చెప్పకోలేకపోతున్నాం



(మొదటిపేజీ తరువాయి)

అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం ఏడాదిన్నరలో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు ఎంతోచేసినప్పటికీ ఆశించిన రీతిలో ప్రజలకు వివరించలేకపోతున్నామన్నారు. ఇచ్చిన హామీలనే గాక ఇతర అంశాలలో ప్రజోపయోగపనులు చేపట్టామని , 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే ఇంత భారీ నియామకాలు చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణను అగ్రపథంలో నిలిపామన్నారు. ఇవేగాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు సన్నబియ్యం, మహిళలకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతుభరోసా పెంపు, రుణమాఫీ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, డైట్ ఛార్జీలు 40 శాతం పెంపు,ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పంపిణీ ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో చేశామన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలలో చేయలేనిది ఏడాదిన్నరలో చేసి చూపించామన్నారు. పదేళ్ళలో పేదలకు రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే ఆలోచన కూడా చేయలేదన్నారు. ఉన్న రేషన్ కార్డులలో పేర్లు కూడా నమోదు చేయలేదని, గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డుల్లో పేరునమోదు కోసం ఎదురు చూస్తున్న 15 లక్షల మంది పేదల పేర్లను రేషన్ కార్డులలో నమోదు చేశామన్నారు. కొత్తగా 7 లక్షల రేషన్ కార్డులిచ్చామని, భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. ఆర్థికంగా ఎంతో ఇబ్బంది ఉన్నాకూడా పేదల సంక్షేమం విషయంలో ఈ ప్రభుత్వం రాజీ పడడం లేదన్నారు. ఈ ప్రభుత్వం తీసుకున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లాస్థాయిలో పౌరసంబంధాల శాఖ అధికారులదేనని ఈ బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ డైరెక్టర్ జగన్ డిప్యూటీ డైరెక్టర్ మధు పాల్గొన్నారు.

# ఆంధ్రా అమ్మేయాలి

- ఆ పథకం ఇవ్వాలంటే అంత డబ్బు అవసరం
- మహిళలకు నెలకు రూ.1500 పథకంపై
- మంత్రి అచ్చెన్న సంచలన వ్యాఖ్యలు



**విజయనగరం, మహా:** మంత్రి అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళ పాలెంలో జరిగిన 'సుపరిపాలనకు తొలి అడుగు' సభలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. రాష్ట్రంలో తాము ఇప్పటికే అన్ని హామీలు నెరవేర్చామని, ఒక్క మహిళలకు నెలకు 1500 ఇచ్చే పథకం మాత్రమే అమలు చేయాల్సి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. తమ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో భాగమై దీన్ని అమలు చేయాలంటే ఆంధ్రానే అమ్మేయాలంటూ వ్యాఖ్యానించారు. దీంతో అక్కడున్న వారంతా షాకయ్యారు. మహిళలకు నెలకు 1500 ఇచ్చే మహాశక్తి పథకం ఇవ్వాలంటే ఆంధ్రానే అమ్మాల్సిన అవసరం ఉందని, అంత డబ్బు అవసరం ఉందని ఏం చేయాలంటూ అచ్చెన్న ప్రశ్నించారు. దీని కోసం ఏం చేయాలనే విషయంపై సీఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నారని అచ్చెన్న వెల్లడించారు. మిగతా పథకాలు మాత్రం పక్కాగా అమలు చేశామని అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ పథకంపై మాత్రం త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

# రోజా ఆడనా? మగనా?

## మనం సైలెంట్‌గా ఉంటే.. రప్పారప్పాగాళ్ళంతా రోడ్డెక్కుతున్నారు

### రోజాకు జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి కౌంటర్

**అమరావతి, మహా :** రోజాకు బొలిశెట్టి కౌంటర్ రోజా వ్యాఖ్యలపై టీడీపీ, జనసేన నేతలు మండిపడుతున్నారు. తాజాగా జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆమెకు కౌంటరిచ్చారు. 'మనం సైలెంట్‌గా ఉంటే ఈ రప్పా రప్పా గాళ్లంతా రోడ్లెక్కి మాట్లాడుతుంటే మనమంతా ఎక్కడ ఉన్నామో అర్థం కావడం లేదు. ఎమ్మెల్యే నా కొడుకులట.. రోజా మాట్లాడుతుంది.. ఆమె అసలు ఆడదో, మగదో ఎవడికీ తెలియదు. ఎమ్మెల్యే నా కొడుకులంటే జగన్ కూడా దాని కొడుకేనా?. ఎమ్మెల్యే అంటే జగన్, చంద్రబాబు కూడా ఎమ్మెల్యేలే కదా. నా వయసెంత రోజా వయసెంత.. ఇలాంటి దురదృష్టకరమైన బూతులు. కొంతమంది కాపుల్ని ఉసిగొలిపి వాళ్లతోనే స్టేట్‌మెంట్స్. అంబటి రాంబాబు, పేర్ని నాని.. పనికిమాలినోళ్లంతా వచ్చి దమ్ముంటే అరెస్ట్ చేసుకోమంటున్నారు' అని బొలిశెట్టి శ్రీనివాస్ మండిపడ్డారు.

## ధన్ ఖడ్ రాజీనామాకు
# రాష్ట్రపతి ఆమోదం

## ఉపరాష్ట్రపతిగా నితీష్ కుమార్ ?

### తెరపైకి శశిధరూర్, మరో ఇద్దరు కేంద్ర మంత్రుల పేర్లు




**న్యూఢిల్లీ, మహా :** ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఇక ఉపరాష్ట్రపతి పదవికి ఉప ఎన్నిక పదవికి ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించనుంది. అయితే ఇప్పుడు బీజేపీ పెద్దల దృష్టిలో ఉపరాష్ట్రపతి పదవికి ఎవరు ఉన్నారన్నది సస్పెన్స్ గా మారింది. పలు పేర్లు ప్రచారంలోకి వస్తున్నప్పటికీ ఒకే ఒక్క పేరుపై ఎక్కువ చర్చ జరుగుతోంది. ఆ పేరు బీహార్ సీఎం నితీష్ కుమార్. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడం బీజేపీకి ఇప్పుడు ఓ సవాల్ గా మారింది. సుదీర్ఘ కాలంగా అధికారంలో ఉన్న నితీష్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. ఇటీవలి కాలంలో ఆయన అంత చురుకుగా వ్యవహరించలేకపోతున్నారు. విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. ఆరోగ్యం కూడా సరిగా లేదని అంటున్నారు. ఇలాంటి సమయంలో బీజేపీ, జేడీయూ సీఎం ఫేస్‌గా ఈ సారి నితీష్‌ను కాకుండా కొత్త వ్యక్తిని చూపించాలనుకుంటున్నారు. అయితే సీఎం నితీష్ ను తప్పించడం వల్ల బలమైన వర్గం అసంతృప్తికి గురైతే మొదటికే మోసం వస్తుంది. అందుకే నితీష్‌ను అత్యున్నతంగా గౌరవిస్తున్నామని చెప్పేందుకు ఉపరాష్ట్రపతి పదవిలో కూర్చోబెట్టే ఆలోచన చేస్తున్నట్లుగా తెలుస్తోంది. నితీష్ కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరించి ఉన్నట్లయితే ఖచ్చితంగా ఆయన తదుపరి ఉపరాష్ట్రపతి అవుతారు. అదే సమయంలో శశిథరూర్ తో సహా మరో ఇద్దరు కేంద్ర మంత్రుల పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయి. మోదీ, షా రాజకీయ వ్యూహాల ప్రకారమే ధన్‌ఖడ్ రాజీనామా చేసి ఉంటారు కాబట్టి.. వారి ఆలోచనల ప్రకారమే తదుపరి ఎంపిక ఉంటుంది. వారెవరన్నది త్వరలోనే తెలిసే అవకాశం ఉందని పార్లమెంట్ ఆవరణలో జోరుగా ప్రచారం సాగుతోంది.

# ఉత్తరాది నకిలీల చెరలో తెలంగాణ మార్కెట్లు

- రాజస్థాన్, యూపీ, హర్యానా నుండి డూప్లికేట్లు
- డూప్లికేట్ ఎలక్ట్రిక్ వస్తువుల మాయ ప్రపంచం
- నకిలీ సామాగ్రి వెనుక ఉన్న ముఠాల రాజకీయం
- ప్రజల ప్రాణాలను బలికొంటున్న చౌక ధర
- ఖమ్మం నుండి కామారెడ్డి దాకా ఫేక్ వ్యాపారం

ఖమ్మం, మహా:



తెలంగాణ గృహ నిర్మాణాల్లో చౌక ధరల పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఉత్తరాది వ్యాపార ముఠాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. అసలు కంపెనీల పేర్లతో నకిలీ ఎలక్ట్రికల్ సామాగ్రిని మార్కెట్లలో పోగ పెట్టినట్టుగా అమ్ముతున్న ఈ వ్యాపారులు, లక్షల్లో లాభాలు గడించుకుంటున్నారు. కానీ ప్రజల గదుల్లో, పిల్లల పడకగదుల్లో, రైతుల బోర్లు, కూలీల షెడ్‌లలో... ఆ నకిలీ వైర్ల వల్ల శాశ్వత ప్రమాదం నిత్యం ముప్పు విసురుతోంది. హైదరాబాద్ నుంచీ ఖమ్మం వరకూ, కొత్తగూడెం నుంచీ కామారెడ్డి దాకా... రాజస్థాన్ తో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాల చీకటి సామ్రాజ్యం అంతా బహిరంగం. ఇది కేవలం మార్కెట్ సమస్య కాదు – ఇది ప్రజల ప్రాణాలకు ప్రమాదం. డూప్లికేట్ వైర్లు మంటలు అంటిస్తే ఆ లోగిలిలో చిరునవ్వులే ఆహుతి అవుతాయి. ఇది వాణిజ్య మోసం కాదు ఇది మరణానికి నెమ్మదిగా నడిపించే కుట్ర అంటూ ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి.

### డూప్లికేట్ సామాగ్రి వ్యాపారంలో ఉత్తరాది మార్వాడీ ముఠాల హవా

ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం, ఖరేడ్‌పల్లీ వంటి పట్టణాల నుంచి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ వరకు మార్వాడీ వ్యాపారస్తుల డూప్లికేట్ సామాగ్రి సామ్రాజ్యం పటిష్ఠంగా విస్తరించింది. వీరంతా ఉత్తరాది రాష్ట్రాలైన రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా వంటి ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే నకిలీ ఎలక్ట్రికల్ సామాగ్రిని స్థానిక మార్కెట్‌లో పాకించేస్తున్నారు. అసలు కంపెనీలకు సంబంధం లేని ఈ వస్తువులు మాత్రం నకిలీ లేబుల్లతో, ఆర్భాటంగా ఉండే ప్యాకింగ్‌తో ప్రజల్ని మోసగిస్తూ ఉన్నాయి. వీరికి ఉన్న సరఫరా ముఠాల నెట్‌వర్క్ గజగజలాడే స్థాయిలో ఉంది. ఇంటి నిర్మాణాలు చేసే మాకాన్ కాంట్రాక్టర్లను, గ్రామీణ ఎలక్ట్రిషియన్లను, చిన్న రీటైల్ షాపర్లను మాయచేసేలా వాణిజ్య చాతుర్యంతో వీరు పనిచేస్తున్నారు.

### నకిలీ తయారీ కేంద్రాల నిజాలు

నకిలీ వైర్లు, స్విచ్ బోర్డులు, ఫ్యూజ్ బాక్సులు మొదలైనవి ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్, ముజఫర్‌నగర్, భివాండి వంటి పారిశ్రామిక పట్టణాల్లో తయారవుతున్నాయి. ఇక్కడ చిన్న చిన్న బండ్ల గదుల్లో అసలు కంపెనీల బాక్సులు తక్కువ నాణ్యత గల ప్లాస్టిక్ వస్తువులతో నింపబడతాయి. తక్కువ గ్రేడ్ కాపర్, లోయ్ కండక్టర్లు, ఆల్ టైప్ నాన్ స్టాండర్డ్ ముడి సరుకులు వాడతారు. బయటకు మాత్రం ISI మార్క్, బ్రాండ్ హోల్డర్ కంపెనీ పేరుతో వస్తువులు ముద్రిస్తారు. ఇలా తయారైన సామాగ్రి ఏటా వేలాది టన్నుల మేర తెలంగాణ సహా దక్షిణ భారత మార్కెట్లకు చేరుతోంది. ఈ వస్తువుల ధర తక్కువగా ఉండటం ప్రజలను ఆకర్షించే ప్రధాన కారణం. ఉదాహరణకు అసలు కంపెనీకి చెందిన ఒక్క వైర్ రూ. 2,000 ఖర్చవుతుందంటే, అదే సైజు, అదే కలర్, అదే రేంజ్‌లో ఉన్న నకిలీ వైర్ రూ. 500లో లభిస్తోంది. అదే స్విచ్ బోర్డు విషయానికి వస్తే అసలైనది రూ. 300 అయితే, నకిలీది రూ. 80లో లభిస్తోంది. దీని వల్ల ప్రజలు ఖర్చు తగ్గించుకుంటున్నారనే భావనతో వీటిని వాడుతున్నారు. కానీ, ఈ ఉత్పత్తుల నాణ్యత అత్యంత అధోగతంగా ఉండటంతో ఏ సమయానికైనా ప్రమాదం జరిగే అవకాశముంటుంది. షార్ట్ సర్క్యూట్లు, అగ్నిప్రమాదాలు, మానవ ప్రాణ నష్టాలు వాటి ఫలితాలు.

## తనిఖీలు ఏవి?

ప్రస్తుతం తెలంగాణలో ఉత్తరాది మార్వాడీ షాపుల అధికారం అంతుబట్టని స్థాయికి చేరింది. గ్రామీణ ప్రాంతాల్లో అసలు ఎలక్ట్రికల్ స్టోర్ల పేర్లు కూడా ఉత్తరాది సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండటం గమనార్హం. అసలు లోతు పట్టించుకోకుండా ప్రజలు 'చౌకగా వస్తుందని' కొనుగోలు చేస్తున్నారు. ప్రజలు సరైన అవగాహన కలిగి ఉంటే, బ్రాండ్‌కు చెందిన అసలైన సంస్థల వివరాలు, క్యూ ఆర్ కోడ్‌లు, ఐ ఎస్ ఐ గుర్తింపులను పరిశీలిస్తే తప్పకుండా నకిలీ వాడకాన్ని నిరోధించవచ్చు. ప్రభుత్వం నిఘా వ్యవస్థను పటిష్టం చేసి ఈ నకిలీ దందా, ఉత్తరాది ప్రవాహానికి చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### అధికార యంత్రాంగం మౌనం

మార్కెట్ నియంత్రణ శాఖ, మెట్రోలాజీ విభాగం, మున్సిపాలిటీల డీలర్ల మానిటరింగ్ వ్యవస్థ అన్ని తేలిపోయినట్లు కనిపిస్తోంది. నకిలీ వస్తువులపై సర్టిఫికేట్ అడగడం లేదు, ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి పరిశీలనలు జరగడం లేదు. కేవలం షాపుల నుంచి పన్నుల వసూలుతో సరిపుచ్చుకుంటున్నారు. అధికార యంత్రాంగం చట్టపరమైన విచారణలు జరిపితే ఈ నకిలీ సామాగ్రి వ్యాపారానికి తెరపడుతుంది. కానీ ఆ దిశగా చర్యలు జరగకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

# తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

## ఫలితాల్లో 30,649 మంది అభ్యర్థులు క్వాలిఫై

## టెట్ పరీక్షలకు 1,37,429 మంది హాజరు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫలితాలు విడుదల అయ్యాయి. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా సచివాలయంలో ఫలితాలను విడుదల చేశారు. జూన్ 18 నుంచి 30వ తేదీల మధ్య ఆన్‌లైన్ మోడ్‌లో పరీక్షలు జరిగాయి.

**తొమ్మిది రోజులపాటు..**

జూన్ 18 నుంచి 30వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు 16 సెషన్లలో టెట్ పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. పేపర్ 1కు 63,261 మంది దరఖాస్తు చేసుకోగా.. 47,224 మంది(74.65 శాతం) హాజరయ్యారు. అలాగే పేపర్ 2(మ్యాథ్స్ అండ్ సైన్స్)కు 66,686 మందికి గానూ 48,998 మంది(73.48) హాజరయ్యారు. పేపర్ 2(సోషల్ స్టడీస్)కు 53,706 మందికి దరఖాస్తు చేసుకోగా.. 41,207 మంది(76.73 శాతం) మంది హాజరయ్యారు.




**ఉత్తీర్ణత శాతం వివరాలు..**

పేపర్ 1 కు హాజరైన అభ్యర్థుల్లో 61. 50 (29043 మంది) శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక పేపర్‌లోని మ్యాథ్స్,సైన్స్ విభాగంలో 35.87 శాతం(17574 మంది), సోషల్ స్టడీస్ విభాగంలో 31.73 శాతం(13075 మంది) పాస్ అయ్యారు. మొత్తంగా ఈసారి జరిగిన టెట్ పరీక్షలో 33.98 శాతం (30649 మంది) ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ ప్రకటించింది.

# మరో మైలురాయి దాటిన తెలంగాణ ఆర్టీసీ..

- ఇప్పటి వరకు 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం
- మహిళలు ఉచిత ప్రయాణ విలువ రూ.6700 కోట్లు
- ఎప్పటికప్పుడు ఆర్టీసీకి నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వం
- రేపు రాష్ట్ర వ్యాప్తంగా 97 ఆర్టీసీ డిపోల్లో 341 బస్ స్టేషన్ లలో సంబరాలు
- ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు




**హైదరాబాద్, మహా :** తెలంగాణ ప్రభుత్వం 'మహాలక్ష్మి'పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నారు. సిటీ ఆర్డీనర్, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఫ్రీ బస్ సౌకర్యం కల్పిస్తుండగా ఈ పథకంతో తెలంగాణ ఆర్టీసీ అద్భుతమైన మైలురాయిని అధిగమించింది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 200 కోట్లకు పైగా మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. ఈ ఉచిత ప్రయాణాల విలువ అక్షరాలా రూ. 6,700 కోట్లుగా నమోదైందని ఆర్టీసీ ప్రకటించింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తూ 'మహాలక్ష్మి' పథకాన్ని ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రంలోని మహిళలు ఎక్కడికి వెళ్లినా ఉచితంగా ప్రయాణించేలా ఏర్పాట్లు చేసింది. ఆర్టీసీ బస్సు ఎక్కి కేవలం ఆధార్ కార్డు చూపించి జీరో టికెట్ తీసుకుంటే సరిపోతుంది. దాదాపు 18 నెలలుగా ఈ పథకం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ పథకానికి అవసరమైన నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి విడుదల చేస్తూ.. పథకం విజయానికి తోడ్పడుతోంది. 'మహాలక్ష్మి' పథకం 200 కోట్ల ప్రయాణాల మైలురాయిని చేరుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 97 ఆర్టీసీ డిపోల్లో, 341 బస్ స్టేషన్లలో రేపు (జూలై 23) సంబరాలు జరపాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ పథకం ద్వారా మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు, ఆర్టీసీకి కొత్త బస్సుల అవసరం కూడా పెరిగింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**మరిన్ని బస్సుల కొనుగోళ్ళు**

త్వరలో ప్రభుత్వం కొత్త బస్సుల కొనుగోలుకు కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే పలు జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోనూ ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెడుతున్నట్లు చెప్పారు. ఈ పథకం మహిళల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంపొందించడమే కాకుండా, ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# గాలిలో గెలిచిన గాలిగాళ్ళు

## మేం అధికారంలోకి వస్తే అమెరికా పారిపోతారు

### వైరల్ గా రోజా సంచలన కామెంట్స్.. పవన్ కల్యాణ్ కు పిచ్చి ముదిరింది

**అమరావతి, మహా :** గాల్లో గెలిచిన గాలి గాళ్ళు ఎక్కువయ్యారని, రేపు వైసీపీ అధికారం కి వస్తే టీడీపీ, జనసేన నాయకులు హైదరాబాద్ కు కాదు అమెరికాకు పారిపోతారని మాజీ మంత్రి రోజా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసారు. రోజా చేసిన ఈ వ్యాఖ్యల వీడియో తెలుగునాట వైరల్ అవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీకెండ్ నాయకులను సంబోధించారు. ప్రజలకు రేషన్ ఇచ్చే వాహనాలకు డబ్బులు లేవు కానీ.. వీళ్లు మాత్రం హెలికాప్టర్, విమానాలలో తిరుగుతున్నారని విమర్శించారు. వైసీపీ కార్యకర్తలను ఇబ్బంది పెడితే వందకు వంద రేట్లు వడ్డీ వేసి చెల్లిస్తామని రోజా ఘాటు



వ్యాఖ్యలు చేసారు. ఇక పవన్ కల్యాణ్ కు పిచ్చి బాగా ముదిరిందని..ఎక్కడికి వెళితే అక్కడ పుట్టానంటాడు అని రోజా ఎద్దేవా చేశారు. చివరకు సుబ్రమణ్య స్వామి అభిమానిని అంటారని చెప్పుకొచ్చారు.

# బీసీ రిజర్వేషన్ బిల్లుపై ఒత్తిడి తెస్తాం

- పోస్ట్ క్యాస్ట్, ప్రీ క్యాస్ట్ సర్వే రిపోర్ట్ అసెంబ్లీలో పెట్టాం
- పార్లమెంట్‌లో పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తాం
- గవర్నర్ ఆమోదం పొందగానే 42 శాతం రిజర్వేషన్లపై ముందుకెళ్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి బీసీలంటే చిన్నచూపు ఉన్నట్లుంది
- రాంచంద్రరావు లీగల్ నోటీసులకు భయపడే వ్యక్తిని కాదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యలు




**హైదరాబాద్, మహా:** రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతతో సోషియో ఎకనామిక్, పొలిటికల్, క్యాస్ట్ సర్వే చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సర్వే మొదలు పెట్టినప్పుడు అనేక సందేహాలు, అవసరం లేదని కొన్ని రాజకీయ పార్టీలు అన్నాయి.. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వే చారిత్రాత్మక సర్వేగా దేశంలో నిలబడుతుంది.. పోస్ట్ క్యాస్ట్, ప్రీ క్యాస్ట్ సర్వే రిపోర్ట్ అసెంబ్లీలో పెట్టాం.. రాహుల్ గాంధీ ఆలోచనను భారత ప్రభుత్వం తప్పనిసరిగా ఒప్పుకునే పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణలో కులగణన సర్వేపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సెక్రటేరియట్ మీడియా పాయింట్ లో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'తెలంగాణ ప్రభుత్వ సర్వే ఆధారంగా త్వరలో దేశంలో కులగణన జరుగబోతోంది.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేను కలిసి తెలంగాణ సర్వే వారికి ఇచ్చి త్వరితగతిన పార్లమెంటులో మద్దతు కూడగట్టి బీసీ రిజర్వేషన్ బిల్ పాస్ చేయించేలా ఒత్తిడి తెస్తాం.. వంద మంది లోక్ సభ సభ్యులు, ఇతర పార్టీల సభ్యులను కలిసి బిల్ పాస్ కావడానికి వారి సహకారం తీసుకుంటాం.. ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వడం న్యాయమైంది.. సహేతుకమైనదని వారి మద్దతు కూడగడుతాం.. మంచి సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.. ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు కులగణన చేస్తామని హామీ ఇచ్చారు.. దాని ప్రకారమే తెలంగాణలో అధికారంలోకి రాగానే కులగణన చేశాం' అని భట్టి పేర్కొన్నారు.

**ఆ ఆలోచన మాకు లేదు..**

తెలంగాణ మోడల్‌ను దేశం ఫాలో అవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. 'ఏ రాష్ట్రం అయిన కులగణన చేయాలంటే తెలంగాణను రిఫరెన్స్‌గా తీసుకుంటారు.. ముఖ్యమంత్రి నాయకత్వంలో ఓ డెలిగేషన్ ముఖ్య నాయకులను కలసి మద్దతు అడుగుతాం.. 42శాతం బిసి రిజర్వేషన్లకు రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు మద్దతు ఇచ్చారు.. పార్లమెంటులో కూడా ఆ పార్టీలకు చెందిన మిగతా సభ్యులు కూడా మద్దతు ఇస్తారనే నమ్మకం మాకు ఉంది.. 82 కోట్ల పేపర్లలో సర్వే వివరాలు నిక్షిప్తం అయి ఉన్నాయి. మళ్లీ కులగణనలోని కులాల వివరాలు అసెంబ్లీలో పెడతాం.. 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ఆర్డినెన్స్ ముసాయిదా గవర్నర్ కు పంపాము.. మాకు నమ్మకం ఉంది. బీజేపీ రామచంద్రరావుకు దళితులు, బలహీన వర్గాలు అంటే చిన్న చూపు ఉంది.. గతంలో కొన్ని సార్లు అలాంటి ప్రయత్నాలకు ఆయన అడ్డు తగిలారు.. రాంచంద్రరావు లీగల్ నోటీసులకు భయపడే వాడు కాదు భట్టి విక్రమార్క.. సమయం వచ్చినప్పుడు లీగల్ నోటీసులకు సమాధానం చెబుతా.. బీసీలను మధ్య పెట్టె ఆలోచన మాకు లేదు.. బీఆర్ఎస్‌కు ఆ అలవాటు ఉంది కాబట్టి అలాంటి మాటలు మాట్లాడుతారు' అని విమర్శించారు.



## నడ్డాను కలిసిన బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు

### భవిష్యత్ కార్యాచరణపై చర్చ

**ఢిల్లీ, మహా:** జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపైనా, పార్టీ భవిష్యత్ కార్యాచరణపైనా విస్తృతంగా చర్చ జరిగినట్లు సమాచారం. తెలంగాణలో బీజేపీ ఆధిపత్యాన్ని పెంచే దిశగా అనుసరించాల్సిన మార్గాలు, వ్యూహాలపై జేపీ నడ్డా స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. గత రాజకీయ పరిస్థితులు, ప్రస్తుత రాజకీయం, ప్రజల సమస్యల పట్ల తన అవగాహనను పంచుకుంటూ, ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేసేందుకు ఆయా నియోజకవర్గాల్లో పార్టీ చైతన్యం పెంపుపై దృష్టిసారించాలని సూచించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని, పార్టీ కార్యకర్తలను సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు సంస్థాగత రాజకీయాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది.

# హరీశ్ రావుపై తిరగబడ్డ సిద్దిపేట!

## ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు

### హరీశ్ వ్యాఖ్యలపై పలువురు అభ్యంతరం

### మరోవైపు ప్రోటోకాల్ రగడ..

### కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల పోటాపోటీ నినాదాలు

(మొదటిపేజీ తరువాయి)

రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంలో 40 నుంచి 50 శాతం నూకలు ఉంటున్నాయని, దొడ్డు బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంగా పంపిణీ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లాలో ప్రజల నుంచి పెద్ద మొత్తంలో ఫిర్యాదులు వస్తున్నాయని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు సత్వర పరిష్కారం చూపించాలని, ఇచ్చిన మాట ప్రకారం, మంచి మంచి సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో హరీశ్ రావు వ్యాఖ్యలపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హరీశ్ రావు డౌన్.. డౌన్ అంటూ స్లొగన్స్ ఇచ్చారు.

**ప్రొటోకాల్ రగడ..**

అంతకుముందు దుబ్బాక భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఫొటో ఫ్లెక్సీలో పెట్టలేదంటూ ఆ పార్టీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. నేతలు, కార్యకర్తలు నినాదాలతో నిరసన తెలిపారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు కూడా నినాదాలు చేస్తూ ఆందోళన దిగాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పరస్పర నినాదాలతో కలెక్టరేట్ సమావేశ మందిరం హోరెత్తింది. మంత్రి వివేక్, కలెక్టర్ హైమావతి, పోలీసులు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

## పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఎంపీల నిరసన

### బీహార్ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ ఇండియా బ్లాక్ నిరసన

**ఢిల్లీ, మహా:** బీహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ పార్లమెంట్ వేదికగా ఇండియా బ్లాక్ నిరసన చేపట్టింది. మకర్ ద్వార్ ఎదుట లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎస్ ఎంపీ అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ ఎంపీ మీసా భారతి, డీఎంకే ఎంపీ కనిమొళి సహా పలువురు ఇండియా బ్లాక్ ఎంపిలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. మంగళవారం లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభమైన రెండు నిమిషాలకే సభ మధ్యాహ్నానికి వాయిదా పడిన సంగతి తెలిసిందే. బీహార్‌లోని ఎస్ఐఆర్‌కి సంబంధించి ప్రతిపక్ష సభ్యులు పలు అంశాలను లేవనెత్తేందుకు యత్నించారు. కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ఎస్ఐఆర్‌పై నోటీసు ఇచ్చారు. కానీ సభ రెండు నిమిషాల్లోనే వాయిదా పడింది. నిబంధన 267 కింద ప్రతిపక్ష సభ్యులు 12 వాయిదా నోటీసులు ఇచ్చారు. జాబితా చేయబడిన అంశంపై చర్చించడానికి ఈ రోజు సభా కార్యకలాపాలను నిలిపివేయాలని కోరింది. అయితే డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ఈ వాయిదా నోటీసులను తిరస్కరించారు. నేడు లోక్‌సభలో గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2024ను చర్చించనున్నారు.

# రాష్ట్రానికి రెడ్ అలర్ట్!

## మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు

### హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరికలు

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కుండపోత వానలు కురుస్తున్నాయి. మంగళవారం సాయంత్రం కూడా నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అలానే చైతన్యపురి, దిల్‌సుఖ్ నగర్ ఏరియాల్లో కూడా మోస్తరు వాన కురిసింది. కిషన్ పురా, హైదర్ కోట్, నార్సింగ్ ప్రాంతాల్లో కూడా వర్షం కురిసింది. ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో వాతావరణ శాఖ అధికారులు కీలక అలర్ట్ జారీ చేశారు. వ్యాప్తంగా మూడు రోజుల పాటు కుండపోత వానలు కురుస్తాయని.. పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

**ఈ జిల్లాలో అతి భారీ వర్షా లు..**

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు రెడ్ , ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఆయా జిల్లా వాసులు అప్రమత్తంగా ఉండాలని.. అవసరమైతేనే బయటకు రావాలని తెలిపారు. అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ సంచాలకురాలు డాక్టర్ నాగరత్న మాట్లాడుతూ .. రాష్ట్రంలో పలు



జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు ఆమె తెలిపారు. ఇక వాతావరణ శాఖ అధికారులు నిర్మల్, పెద్దపల్లి, మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. ఇక నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. అలాగే, జులై 24, 26 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ వివరించింది.



## రప్పా రప్పా అంటే మెడచూపిస్తామా? తాట తీస్తాం

### వైసీపీకి పవన్ కల్యాణ్ వార్నింగ్

**మహా :** వాళ్లు రప్పా రప్పా అంటే తాము మెడలు కోయించుకోవడానికి సిద్ధంగా లేమని జనసేనాని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. వాళ్లు కోస్తామంటే తాము మరోవైపు నుంచి మెడ చూపిస్తామా..? అని ప్రశ్నించారు. ఇక్కడ ఎవరూ అంత తేలికగా లేరని పవన్ కల్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. ఏపీ సచివాలయంలో పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ కార్యాలయానికి అనేక మంది బాధితులు వచ్చారని.. ఇప్పుడు మద్యం కుంభకోణంలో అనేక మంది అరెస్టు అవుతున్నారని తెలిపారు. రాజధాని అమరావతి భూ సమీకరణపై తన నిర్ణయాన్నిఇప్పటికే సీఎం చంద్రబాబుకి చెప్పానని.. సీఎం కూడా తన అభిప్రాయంతో ఏకీభవించారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అందరిని ఒప్పించి వాళ్లను కూడా భాగస్వాములుగా చేసి ముందుకు వెలుదామని చెప్పానని.. అందుకు సీఎం కూడా ఒప్పుకున్నారని తెలిపారు. మనం అమరావతి ఏకైక రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. అందుకనే వివాదాలు చేయకూడదని చెప్పానని అన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమని ఉద్ఘాటించారు. మంచి సినిమా కథలు వస్తే నిర్మాతగా వ్యవహరిస్తానని.. ఈ అంశాలన్నీ కూడా సీఎం చంద్రబాబుకు కూడా చెప్పానని గుర్తుచేశారు. సీఎంకు చెప్పిన అనంతరమే సినిమాల గురించి నిర్ణయాలు తీసుకున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

## నేడు, రేపు కీలక సమావేశాలు

### రేపు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలతో భేటీ

**హైదరాబాద్, మహా :** సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్ళారు. ఈ పర్యటనలో సీఎం పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ నిధులు, పలు ప్రాజెక్టుల అనుమతి, నిధుల విడుదలపై చర్చించనున్నారు. జులై 24న ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీలతో సమావేశమై తెలంగాణలో నిర్వహించిన కులగణన సర్వే ఫలితాలను సమర్పించనున్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ అమలుపై వివరణ ఇవ్వనున్నారు. అదే రోజు ఢిల్లీలోని ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ ఎంపీలకు కులగణనపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు చట్టబద్ధతపై అమలుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఎంపీలను కోరనున్నారు. ఈ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఢిల్లీకి వెళ్లనున్నారు.

### కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్ లేకుండా..

# ఢిల్లీలో ఆరుగురు బీజేపీ ఎంపీల భేటీ

## దీని సంకేతమేంటి?



**ఢిల్లీ, మహా:** తెలంగాణ నుండి 8మంది లోక్ సభ సభ్యులు బిజెపి తరుపున గెలవగా, ఇందులో ఆరుగురు ఒకేచోట కలిశారు. పార్లమెంట్ సమావేశాలకు వెళ్ళిన నేతలు ఒకే చోట భేటీ కాగా, ప్రధానంగా ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ కలిసి ఉన్న ఫొటో వైరల్ అయింది. ఈ భేటీలో ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి. గోడం నగేష్ ఉన్నారు. ఆరుగురు ఎంపీలలో ధర్మపురి మినహా అందరూ ఇతర పార్టీల నుండి వచ్చి ఎంపీలుగా గెలిచిన వారే. దీంతో తెరవెనుక రాజకీయంపై రకరకాల ఊహాగానాలు సాగుతున్నాయి. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్ లతో పాటు రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ కూడా ఈ భేటీలో లేరు. దీంతో పాత, కొత్త విభజన చర్చలు సాగుతున్నట్లు స్పష్టంగా కనబడుతోంది. మరోవైపు ఈటల రాజేందర్ బండిసంజయ్ పై చేసిన వ్యాఖ్యలపై పార్టీలో చర్చ జరుగుతుండగా, హైకమాండ్ బయట ఎవరూ మాట్లాడవద్దని అల్టిమేటం జారీచేసింది.

# తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -3 నిర్మాణానికి కమిటీ

**తిరుమల, మహా :** తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మంగళవారం నిర్వహించిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహించిన ఈ సమావేశంలో బోర్డు మెంబర్, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయానికి విచ్చేసే భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించేందుకు రూ.4.35 కోట్లు కేటాయించినట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు చెప్పారు. ఈ సందర్భంగా ఈవో జె.శ్యామలరావుతో కలిసి మీడియా సమావేశంలో ఆయన టీటీడీ ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయాలను వివరించారు.

తిరుమలలో రోజురోజుకు పెరుగుతున్న శ్రీవారి భక్తుల రద్దీకి అనుగుణంగా భవిష్యత్ అవసరాల దృష్ట్యా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 3 నిర్మించేందుకు సాధ్యసాధ్యాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీ వేయాలని నిర్ణయించామన్నారు. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల్లో అన్ని వసతులతో విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాalన్నారు. తిరుమలలోని శిలాతోరణం, చక్రతీర్థం ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ మరియు డీపీఆర్ రూపొందించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు, వివిధ దేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి నిపుణుల కమిటీ నివేదిక సమర్పించింది. దీనిపై టీటీడీ ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేసి సదరు కమిటీ ఇచ్చే నివేదిక ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీవారి భక్తులు సైబర్ మోసాలకు గురికాకుండా నియంత్రించేందుకు సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. తిరుమలలో పరిపాలన సౌలభ్యం కోసం అన్ని విభాగాలు ఒకచోట కేంద్రీకృతమయ్యేలా నూతన పరిపాలన భవనం నిర్మాణానికి ఆమోదించారు. పదకవితా పితామహుడు అన్నమయ్య జన్మించిన తాళ్లపాకలో పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం నిపుణులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందిచాలని, సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా నిర్మించిన 320 ఆలయాలకు రూ.79.82 లక్షలతో మైక్ సెట్లను ఉచితంగా అందించాలని నిర్ణయించారు. రాష్ట్ర దేవాదాయశాఖ సూచనల మేరకు శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించే శ్రీవారి ఆలయాలు, భజన మందిరాలకు నిధులు చెల్లించేందుకు మూడు కేటగిరీలుగా విభజన. మూడు కేటగిరీల్లో రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షలుగా నిర్ణయం తీసుకున్నారు. ఏపీ హైకోర్టు తీర్పు మేరకు టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్లుగా పని చేస్తున్న 142 మందిని క్రమబద్ధీకరించేందుకు ఆమోదిస్తూ ప్రభుత్వ ఆమోదానికి పంపాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, పలువురు బోర్డు సభ్యులు, జెఈవో శ్రీ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

# నా బాడీ కలర్ చూసి రిజెక్ట్ చేశారు

## వాణికపూర్

బాలీవుడ్ నటి వాణికపూర్ ప్రస్తుతం క్రేజీ వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆమె ప్రధాన పాత్రలో నటించిన థ్రిల్లర్ వెబ్ సిరీస్ మండల మర్డర్స్. ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈనెల 25 నుంచి సందడి చేయనుంది. ఈ సిరీస్‌లో వాణీకపూర్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుంది. వైభవ్ రాజ్ గుప్తా, సుర్వీన్ చావ్లా కీలక పాత్రలు పోషిస్తున్నారు. కొన్ని శతాబ్దాల కిందట చరణ్‌దాస్‌పూర్‌లో జరిగిన హత్యల నేపథ్యంలో ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. ఈ వెబ్ సిరీస్‌కు గోపి పుత్రన్ దర్శకత్వం వహించగా.. యశ్‌రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో నిర్మించారు.

తాజాగా ఈ సిరీస్ ప్రమోషన్లతో బిజీగా వాణి కపూర్ కెరీర్ ప్రారంభంలో తనకెదురైన చేదు అనుభవాన్ని పంచుకుంది. కెరీర్ తొలినాళ్లలో ఎదురైన సవాళ్లను ప్రస్తావించింది. తాను కూడా బాడీ షేమింగ్‌కు గురైనట్లు వెల్లడించింది. తన స్కిన్ టోన్ కారణంగా ఓ సినిమాలో పాత్రకు రిజెక్ట్ చేశారని తెలిపింది. తాను చాలా సన్నగా ఉండటం వల్ల తరచుగా బాడీ షేమింగ్‌కు గురయ్యానని పేర్కొంది.

తాజా ఇంటర్వ్యూలో వాణి కపూర్ మాట్లాడుతూ.. 'కెరీర్ మొదట్లో తనను రిజెక్ట్ చేయడం.. తన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. ఒక చిత్రనిర్మాత ఒకసారి నేను పాత్రకు న్యాయం చేయలేదని అన్నారు. తనను 'మిల్కీ వైట్'ని కాదని అన్నారు. ఆ విషయాన్ని తాను నేరుగా కాకపోయినా.. ఇతరుల ద్వారా తెలుసుకున్నా. తనపై ఎలాంటి కామెంట్స్ చేసినా తన గుర్తింపు, సామర్థ్యాలపై తనకు పూర్తిగా నమ్మకముంది. ఉంది. తాను సన్నగా ఉన్నానని.. బరువు పెరగాలని కొందరు సలహాలు ఇచ్చారు. కానీ నేనేంటో నాకు తెలుసు. నాలా ఉండటమే నాకిష్టం' అంటూ చెప్పుకొచ్చింది. కాగా.. మండల మర్డర్స్ సిరీస్‌లో సుర్వీన్ చావ్లా, వైభవ్ రాజ్ గుప్తా, శ్రియా పిల్గావ్‌కర్, జమీల్ ఖాన్ కూడా నటించారు.



# అవతార్-3 ఫస్ట్ లుక్ వచ్చేసింది




హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'అవతార్'.. ప్రపంచ సినీ చరిత్రలో ఈ సినిమా ఒక సంచలనం. మొదటి భాగంలో పండోర అనే గ్రహాన్ని క్రియేట్ చేసి అందులోని ప్రకృతి అందాలను కళ్లుచెదిరే విజువల్ ఎఫెక్ట్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేశారు దర్శకుడు. ఆ తర్వాత పార్ట్2 'అవతార్: ది వే ఆఫ్ వాటర్'తో మెప్పించారు. తాజాగా దీని మూడో భాగం 'అవతార్- ఫైర్ అండ్ యాష్' గురించి అదిరిపోయే అప్‌డేట్‌ను మేకర్స్ ప్రకటించారు.

అవతార్ ఫ్రాంఛైజ్ చిత్రాల కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఈ క్రమంలో మూడో భాగం 'అవతార్- ఫైర్ అండ్ యాష్' ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఆపై జులై 25న మొదటి ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 2026 డిసెంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా దాదాపు160 భాషల్లో 'అవతార్ 3' విడుదల కానుంది.

పార్ట్2 అయిన 'అవతార్: ది వే ఆఫ్ వాటర్'లో 'కేట్ విన్స్‌లెట్' చేసిన రోనాల్ పాత్రను అవతార్ 3లో మరింత పొడిగించామని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఇందులో ఆమె పాత్ర చాలా కీలకంగా ఉంటుందని చెప్పారు. అందుకోసం ఆమె చాలా కష్టపడి శిక్షణ తీసుకున్నట్లు కూడా తెలిపారు. అవతార్ ఫ్రాంచైజీలో భాగంగా రానున్న 'అవతార్ 4' 2029లో, 'అవతార్ 5' డిసెంబరు 2031లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం గతంలోనే తెలిపింది.

### నవీన్ చంద్ర...ఓటీటీ సూపర్‌స్టార్..

# మన హైదరాబాదీయే...



అనువు గాని చోట అధికులమనరాదని నాటి తరంలో చెప్పారు. అనువైన చోట అధికులమయ్యే అవకాశాన్ని వదులుకోరాదని నేటి తరం అంటోంది. తెలుగు నటుడు నవీన్ చంద్ర నటుడిగా మారి దాదాపు 20ఏళ్లు అవుతోంది. ఎటువంటి సినీమా బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఈ రంగానికి వచ్చి స్వయం కృషితో తన 2 దశాబ్ధాల ప్రయాణాన్ని కొనసాగించాడు. నిశ్శబ్ధంగా నిలకడగా సాగుతున్న నవీన్ చంద్ర అభినయ యానం కోవిడ్ తర్వాత అనూహ్య మలుపు తిరిగింది. ప్రస్తుతం ఆయన్ను ఓటీటీ సూపర్‌స్టార్‌గా గుర్తించే స్థాయికి చేర్చింది. సంభవామి యుగే యుగే అనే సినిమా ద్వారా 2006లో తెరంగేట్రం చేసిన నవీన్...ఆ తర్వాత అందాల రాక్షసితో డీసెంట్ సక్సెస్ అందుకున్నాడు. హ్యాండ్సమ్ లుక్‌తో పాటు యాక్టింగ్ స్కిల్స్ కూడా ఉన్న నటుడిగా ఆ సినిమా నవీన్ చంద్రకు మంచి పేరు తెచ్చిపెట్టింది. అయితే ఆ తర్వాత అతని కెరీర్ ఇక ఊపందుకుంటుంది అనుకున్నా అలా జరగలేదు. విభిన్న చిత్రాల్లో నటించినా..ఈ నటుడి స్థాయిని అమాంతం పెంచే చిత్రాలు మాత్రం రాలేదు. అదే సమయంలో కోవిడ్ తర్వాత ఓటీటీ ప్లాట్‌ఫార్మ్స్‌కు ఆదరణ అమాంతం పెరిగింది. దాంతో అటు దృష్టి మరల్చిన నవీన్ 2021లో జియో హాట్ స్టార్ లో విడుదలైన పరంపర సిరీస్ లో అవకాశం అందిపుచ్చుకున్నాడు. ఆ తర్వాత మంత్ ఆఫ్ మధు లాంటి నవీన్ చంద్ర సినిమాలు థియేటర్ కన్నా మిన్నగా ఓటీటీలో చెప్పుకోదగ్గ స్థాయి విజయాలు సాధించాయి. దాంతో ఆయనకు వెబ్ సిరీస్‌లలో అవకాశాలు రావడం మొదలైంది. అలా వచ్చిన అవకాశాలను తెలివిగా అందిపుచ్చుకున్న నవీన్ 'ఇన్‌స్పెక్టర్ రిషి' సిరీస్ విజయంతో తన స్థానాన్ని మరింతగా సుస్థిరపరచుకున్నాడు. వైవిధ్యాన్ని ఇష్టపడే ఓటీటీ ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా ఈ సిరీస్‌లో ఒంటికన్ను కథానాయకుడి పాత్ర పోషించి తన నటనకు నవీన్ మంచి గుర్తింపు పొందాడు. ఆ తర్వాత తక్కువ థియేటర్లలో విడుదలై ఎప్పుడొచ్చిందో పోయిందో తెలియని 'ఎలెవెన్' ఓటీటీ మీద సూపర్ హిట్ అయింది. అత్యధిక వీక్షకులను అందుకుని రికార్డ్స్ క్రియేట్ చేసింది. ఇలా వైవిధ్య భరిత పాత్రలతో నవీన్ చంద్ర ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల మీద సక్సెస్ కు అడ్రెస్ గా మారారు. బలమైన స్క్రిప్ట్‌లను ఎంచుకుని, ప్రతిభావంతులైన చిత్రనిర్మాతలతో పనిచేస్తూ ఆయన ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రస్తుతం ఓటీటీలో నవీన్ చంద్ర విజయ విహారం ఆయనకు తమిళ, తెలుగు సినిమా రంగాల్లోనూ అవకాశాలను పెంచుతోంది. ఓటీటీ ప్రేక్షకుల్లో నవీన్ కు ఉన్న పట్టును దృష్టిలో ఉంచుకుని వెండితెర రూపకర్తలు ఆయన కోసం పాత్రలను సృష్టించే పనిలో పడ్డారు. మొత్తంగా చూస్తే అచ్చంగా డిజిటల్ రంగంలో నవీన్ స్థాయిలో రాణిస్తున్న మరో తెలుగు నటుడు లేరనేది నిస్సందేహం. కొసమెరుపు ఏమిటంటే... ప్రస్తుతం తమిళ, తెలుగు రెండు భాషల ప్రేక్షకుల్ని సమానంగా మెప్పిస్తున్న నవీన్ చంద్ర తల్లిదండ్రుల్లో తండ్రి తమిళనాడుకు, తల్లి తెలంగాణకు చెందిన వారు కావడం విశేషం. జన్మతః హైదరాబాద్ వాసి అయిన నవీన్ చంద్ర తొలి దక్షిణాది ఓటీటీ సూపర్‌స్టార్ గా మారడం తెలుగువారికి గర్వకారణమేనని చెప్పాలి.

# నటులలో మేకవన్నె పులులున్నారు: హీరోయిన్



సినిమా పరిశ్రమలో తనకు అనిపించింది మాట్లాడడానికి చాలా ధైర్యం కావాలి. అలాంటి గట్స్ ఉన్న అతి కొద్ది మంది నటీమణుల్లో మాళవిక మోహన్ ఒకరు. 2013లో 'పట్టం పోలే' అనే మలయాళ చిత్రం ద్వారా నటిగా రంగప్రవేశం చేసిన ఈ బ్యూటీ ఆ తరువాత కన్నడం, హిందీ, తమిళం చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. తాజాగా 'ది రాజాసాబ్' చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చారు. రజనీకాంత్ హీరోగా నటించిన 'పేట' చిత్రంతో కోలీవుడ్‌కు దిగుమతి అయిన ఈ భామ తొలి చిత్రంతోనే పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టి సినీ ప్రముఖుల దృష్టిలో పడ్డారు. ఆ తరువాత విజయ్ సరసన మాస్టర్, ధనుష్‌కు జంటగా మారన్, విక్రమ్ హీరోగా నటించిన తంగలాన్ తదితర చిత్రాల్లో నటించి, తానేమిటో నిరూపించుకున్నారు. ప్రస్తుతం తెలుగు చిత్రం ది రాజాసాబ్‌తోపాటు తమిళంలో కార్తీకి జంటగా 'సర్దార్-2' చిత్రంలోనూ నటిస్తున్నారు.

తాను అనుకున్నది నిర్మొహమాటంగా వ్యక్తం చేసే ఈమె ఇటీవల ఒక భేటీలో మాట్లాడుతూ.. సినిమా పరిశ్రమలో ఆడ, మగ అనే తారతమ్యం ఉండకూడదన్నారు. అయితే అది ఇక్కడ చాలా ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నటులకు దొరికే మర్యాద నటీమణులకు ఇక్కడ ఇవ్వరని పేర్కొన్నారు. పారితోషికం విషయంలోనూ సమానత్వం లేదని పేర్కొన్నారు. హీరోలకు పారితోషికం అడిగినంత ఇస్తున్నారనీ, హీరోయిన్లకు మాత్రం తగ్గించి ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ పక్షపాత ధోరణి మారాలన్నారు. ఇకపోతే సినిమాలో కొందరు నటులు ఉన్నారనీ, వారు మహిళల మధ్య మంచి వారిగా కనపించే ప్రయత్నం చేస్తారన్నారు. అలాంటి మేకవన్నె పులులు సమయం వచ్చినప్పుడు వారి అసలు రంగును బయట పెడతారని అన్నారు. అలా గత 5 ఏళ్లుగా ముఖానికి అందమైన మాస్క్ వేసుకున్న పలువురు నటులను తాను చూశానని పేర్కొన్నారు. వాళ్లంతా బుద్ధిమంతులు అని భావించరాదనీ ఏయే సమయాల్లో నటీమణులతో మంచిగా ఉండాలన్నది వారికి బాగా తెలుసన్నారు. కానీ, కెమెరా వెనుక వారు ఎలా మారుతారు అన్నది తాను కళ్లారా చూశానని నటి మాళవిక మోహన్ పేర్కొన్నారు. ఈ బ్యూటీ ఎప్పుడు ఎక్కడ ఎలాంటి చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నారోగానీ, ఆమె వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com